నేడు రంజాన్

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 10 : దాన ధర్మాలకు ప్రతీకగా భావించే ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) పర్వదినాన్ని గురువారం ముస్లింలు జరుపుకోనున్నారు. బుధవారం రాత్రి నమాజుల అనంతరం నెలవంక కనిపించడంతో రంజాన్ మాస ముగింపు సూచకంగా భావించి శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ క్రమంలో నగర శివారులోని వివిధ ఈద్గా మైదానాల్లో గురువారం ఉదయం 9 నుంచి 10 గంటల్లోపే సామూహిక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. వన్ టౌన్ పోలీసు స్టేషన్ వద్ద గల పురానీ (ఖదీమ్ షాహి) ఈద్గాలో 9 గంటలకు సయ్యద్ షా మహ్మద్ ఖాద్రీ నమాజ్ చేయించి సందేశమివ్వనున్నారు. చింతకుంట ఈద్గాలో 9 గంటల నుంచి ముఫ్తీ ఎత్తెమాదుల్ఫాక్ నమాజ్ చేయించనుండగా, మహ్మద్ ఖైరొద్దీన్ సందేశం ఇస్తారు. సాలెహ్ నగర్ – ఈద్గాలో ఉదయం 9.30 గంటలకు కరీంనగర్ సదర్ ఖాజీ మనబ్ తాఖాన్ నమాజ్ చేయించనుండగా, ముఫ్తీ మహ్మద్ ఘియాస్ మొహియొద్దీన్ సందేశమివ్వనున్నారు.

విజయవంతం చేయాలి

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 10: పట్టణంలో మహాత్మా జ్యోతిబా పూలే 198వ జయంత్యుత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ చైర్మన్ ఉప్పు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేసిన ఆ మహనీయుడి జయంతి వేడుకల్లో నియోజకవర్గ పరిధిలోని ప్రజాసంఘ నాయకులు, పూలే, అంబేద్కర్ వాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఖలీద్ హుస్సేన్, పూలే విగ్రహ కమిటీ అధ్యక్షుడు సమ్మయ్యముదిరాజ్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s: Shriram Finance Limited, Huzurabad Branch. I issue the following notice to general public. My client intends to grant to loan to title Vangapandla Ranjeeth Kumar, S/o: Rajaiah, Age: 33 years, Occ: Business, R/o: H.No. 1-82/1. Kandugula village Huzuabad mandal of Karimnagar dist by keeping the below mentioned property as security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges mortgages Sale agreements Court Attachment, court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice otherwise, later objections will not bind my client in this regard

SCHEDULE OF THE PROPERTY

In Kandugula village, the survey number 747E/A/2, a vacant place to an extent of 643.72 Square yards its equivalent to an extent of 538.15 Square meters, within the boundaries.
North: Vacant place of Vendor,
South: Vacant place of Sheelam Kumar,
East: Road,
West: House of Sheelam Mogili & Open place,
Is situated at Kandugula village Huzurabad mandal of Karimnagar dist
Date: 10-04-2024
Sd/- **G. LAXMANA MURTHY,** Advocate
Huzurabad. Cell No. 94403 69866

CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

CHANGE OF NAME

★I, MANDALA SHIRISHA, R/o. 1-161, Kothapally, Karimnagar, TS, have Changed My Name as MANDALA SHIRISHA REDDY, W/o. Mandala Chakradhar Reddy.
NT-339404

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
నమస్తే తెలంగాణ
200/-
50/-
3+1
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

తాగునీటి ఇబ్బందులు రానివ్వొద్దు

- ట్యాంకులు, సంపులను తరచూ శుభ్రం చేయించాలి
- కలెక్టర్ పమేలా సత్పతి
- కమాన్ పూర్, చింతకుంట గ్రామాల్లో బోర్ల పరిశీలన

కమాన్‌పూర్ గ్రామంలో నూతన బోర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కొత్తపల్లి, ఏప్రిల్ 10 : వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చూడాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. బుధవారం కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లోని డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద, చింతకుంటలోని వినాయకనగర్‌లో ఎస్డీఎఫ్ నిధులతో కొత్తగా వేసిన బోర్‌వెల్స్‌ను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. బోర్‌వెల్స్ ఎన్ని ఫీట్లు వేశారు.. తాగునీటి సరఫరా ఎలా ఉందని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడైనా నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తితే వెంటనే పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. అలాగే, ట్యాంకులను సిబ్బందితో శుభ్రం చేయించాలని సూచించారు. ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, నాచు పేరుకుపోకుండా తరచూ సంపులను శుభ్రం చేయించాలని చెప్పారు. అపరిశుభ్రంగా ఉన్న నీరు తాగితే ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని, స్వచ్ఛమైన నీటిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. నీటి సరఫరాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇక్కడ మిషన్ భగీరథ డీఈ సూర్య ప్రకాశ్, తహసీల్దార్ రాజేశ్, ఆర్ఐ అరుణ్ ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- 'ఉపాధి' కూలీలతో పార్టీ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ మాధవి

గట్టుభూత్కూర్‌లో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న డాక్టర్ మాధవి

గంగాధర, ఏప్రిల్ 10 : బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ సతీమణి డాక్టర్ మాధవి స్పష్టం చేశారు. మండలంలోని గట్టుభూత్కూర్, ఆచంపల్లి గ్రామాల్లో బుధవారం ఆమె ఉపాధిహామీ కూలీలను కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా పదేండ్లలో తెలంగాణ రాష్ట్రం గణనీయంగా అభివృద్ధిని సాధించిందని గుర్తు చేశారు. వినోద్‌కుమార్ ఎంపీగా ఉన్న సమయంలోనే కరీంనగర్‌ను రూ. వెయ్యి కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. 3 లక్షల జనాభా కూడా లేని కరీంనగర్‌కు స్మార్ట్ సిటీని తీసుకువచ్చారని, కొత్తపల్లి మనోహరాబాద్ రైల్వేలైన్‌ను మంజూరు చేయించారని, కేంద్రంతో కొట్లాడి జాతీయ రహదారులను తీసుకువచ్చారని పేర్కొన్నారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు ఆరోగ్య సమస్యలు ఏర్పడితే ప్రతిమ ఫౌండేషన్ ద్వారా తీర్చుతామని హామీ ఇచ్చారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మాజీ జడ్పీటీసీ శ్రీలతామధుసూదన్, మాజీ ఎంపీపీ భాగ్యలతామాధవ్, మాజీ సర్పంచ్ విజేందర్‌రెడ్డి, ప్రతిమ ఫౌండేషన్ పీఆర్‌వో గీత, బీఆర్ఎస్ శ్రేణులు ఉన్నారు.

బల్దియా పారిశుధ్య కార్మికుల సమ్మె

- కార్మిక సంఘం నాయకులతో చర్చించిన మేయర్ సునీల్‌రావు
- సమ్మె విరమిస్తున్నట్లు ప్రకటించిన నాయకులు

మున్సిపల్ కార్మిక సంఘం నాయకులతో మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, ఏప్రిల్ 10: కరీంనగర్ నగరపాలక సంస్థలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు తమకు రావాల్సిన ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం బల్దియా కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టారు. కాగా, విషయం తెలుసుకున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు వెంటనే స్పందించి కార్మిక సంఘం నాయకులతో చర్చలు జరిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించి గురువారం నుంచి విధులకు హాజరవుతామని కార్మిక సంఘం నాయకులు రూప్‌సింగ్, శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం రెండు నెలలకు సంబంధించిన ఏరియర్స్ చెల్లించడం జరిగిందని, వచ్చే నెలలో మరో రెండు నెలల ఏరియర్స్ చెల్లిస్తామని మేయర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే, కార్మికుల సమస్యలను ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు నాయకులు పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుల శ్రేయస్సే లక్ష్యం

బల్దియా పారిశుధ్య కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా పాలకవర్గం పని చేస్తున్నదని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పాలకవర్గం కార్మికులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నదన్నారు. చిన్న చిన్న సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్మికుల సమస్యలను ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ఏప్రిల్ పూర్తయ్యేలోగా ఏరియర్స్ మొత్తం చెల్లిస్తామని తెలిపారు. పారిశుధ్య కార్మికులు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచి ఎంతో మంచి పేరు తీసుకువస్తున్నారని కొనియాడారు. కార్మికులకు ప్రతి నెలా రెండో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని, పనిభారం తగ్గించేందుకు యాంత్రీకరణ చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లోనూ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ చర్చల్లో కార్మిక సంఘ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రూప్‌సింగ్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

బల్దియా కార్యాలయ ఆవరణలో సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు

శ్రీరామ పాదుకారాధన

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 10 : జెట్, వికాస తరంగిణి ఆధ్వర్యంలో క్రోధి నామ నూతన సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతున్న వసంత – నవరాత్రి ఉత్సవాల్లో బుధవారం ఉదయం శ్రీరామ పాదుకారాధనను ఘనంగా నిర్వహించారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి ఉదయం, సాయంత్రం ప్రవచనాలు చేశారు. ఉదయం శ్రీమద్రామాయణ హవనం, తీర్థగోష్ఠి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

16న ఇంగ్లిష్ పరీక్ష

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 10 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీఎస్సీ డిజైనింగ్, టెక్నాలజీ 3వ సెమిస్టర్ ఇంగ్లిష్ పరీక్ష ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేములవాడలోని ధార్మిక డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంగా కేటాయించినట్లు వెల్లడించారు.

ఫీజు చెల్లింపునకు గడువు 22

ఎస్‌యూ పరిధిలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం మొదటి సెమిస్టర్ ఫీజు చెల్లించేందుకు ఈ నెల 22వ తేదీ ఆఖరు గడువు అని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుము రూ. 300తో 25వ తేదీ వరకు చెల్లించవచ్చని సూచించారు.

కరీంనగర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి

చలివేంద్రాలు ప్రారంభం

కొత్తపల్లి, ఏప్రిల్ 10 : తెలంగాణ అగ్రికల్చర్ మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమాన్‌చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగులు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ఇలాంటి సామాజిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. వ్యవసాయ శాఖ మినిస్టీరియల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, టీఎన్జీవోస్ నాయకులు కిరణ్‌కుమార్, హర్మీందర్ సింగ్, రామస్వామి, హరికృష్ణ, షేక్ అమ్జద్, కిరణ్, కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం, ఏప్రిల్ 10: మండల కేంద్రంలో బుధవారం వర్తక–వ్యాపార సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవి దృష్ట్యా ప్రయాణికుల దాహం తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు. కాగా, చలివేంద్రానికి సరిపడా రంజన్లను (కుండలు), మొదటి రోజు కూల్ వాటర్‌ను శ్రీవేణుగోపాల స్వామి ఆలయం తరపున ఆలయ కమిటీ కార్యదర్శి తనుకు వాసు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, వర్తక–వ్యాపార సంఘం నాయకులు, వర్తకులు పాల్గొన్నారు.

డంపు యార్డును తొలగించాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 10: నగర శివారులోని బైపాస్ రోడ్డులో గల మున్సిపల్ డంపు యార్డును తొలగించాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రాజు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డంప్ యార్డులో తరచూ మంటలు అంటుకొని పొగ కమ్ముకోవడం వల్ల రాంపూర్, అలకాపురి, గణేశ్ నగర్, హనుమాన్‌నగర్ వాసులు అనారోగ్యం పాలవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

మంచినీటి సరఫరాకు హెల్ప్‌లైన్

కొత్తపల్లి, ఏప్రిల్ 10 : కొత్తపల్లి మున్సిపల్ పరిధిలో సమర్థవంతంగా మంచినీటి సరఫరా చేయడానికి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంచినీటి ఎద్దడి నివారణకు కలెక్టర్ ఆదేశాల మేరకు హెల్ప్‌లైన్ ప్రారంభించినట్లు తెలిపారు. పట్టణ పరిధిలో ఎక్కడ మంచినీటి సమస్య ఏర్పడినా ఫోన్ నంబర్ 9676420727/ 9989593973లో సంప్రదిస్తే సిబ్బంది వచ్చి పరిష్కారం చేస్తారని, హెల్ప్‌లైన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కవి సమ్మేళనం

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 10: మన సంస్కృతిని గౌరవిస్తూ, భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ సమత పేర్కొన్నారు. క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకల్లో భాగంగా బుధవారం కళాశాలలో తెలుగు విభాగం సౌజన్యంతో కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న యువ కవయిత్రులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సుష్మ, తెలుగు విభాగాధిపతి సీహెచ్ కవిత, గ్రంథాలయాధికారి మోహన్ రావు, మౌనిక, అధ్యాపకులు పాల్గొన్నారు.

రంజాన్ ఏర్పాట్ల పరిశీలన

హుజూరాబాద్‌టౌన్, ఏప్రిల్ 10: పట్టణంలోని ఈద్గా అండ్ ఖబ్రస్తాన్‌లో రంజాన్ పండుగ ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ పరిశీలించారు. గురువారం నిర్వహించుకునే రంజాన్ పండుగ ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఇతర అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇంజినీర్ సాంబరాజు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మాజీ ఆప్షన్ మెంబర్స్ ఎండీ ఇమ్రాన్, ఎండీ గఫార్, ముస్లిం నాయకులు, మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

భూఆక్రమణ కేసులో మరొకరి అరెస్ట్

రాంనగర్, ఏప్రిల్ 10 : నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి వాటి ద్వారా భూమిని ఆక్రమించిన కొత్తపల్లి మాజీ ఎమ్మార్వో చిల్లా శ్రీనివాస్, అతడికి సహకరించిన వారిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. సీతారాంపూర్‌కు చెందిన బొంతల రఘురాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో 12 మందిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ చేయగా, మిగిలిన తొమ్మిది మంది నిందితుల్లో బుచ్చిరాజును బుధవారం అరెస్ట్ చేశారు. కరీంనగర్ భగత్‌నగర్‌కు చెందిన ఎల్లంకి బుచ్చిరాజు గతంలో కలెక్టరేట్‌లో ధరణి కో ఆర్డినేటర్‌గా పని చేశారు. ఆ సమయంలోనే అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు, అతడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

కార్పొరేషన్, ఏప్రిల్ 10: నగరంలోని టిఫిన్ సెంటర్లలో ప్లాస్టిక్ సంబంధించిన వస్తువులను వినియోగించవద్దని నగర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నగరంలోని పలు టిఫిన్ సెంటర్లలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిఫిన్ సెంటర్లలో అరిటాకులు లేదా స్టీల్ ప్లేట్లను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ ప్లేట్లు, వస్తువులను వాడకూడదన్నారు.

ఎలుబాకలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు

కేంద్ర బలగాల కవాతు

వీణవంక, ఏప్రిల్ 10: రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా మండలంలోని ఎలుబాక గ్రామంలో బుధవారం వీణవంక పోలీసుల ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. అనంతరం గ్రామ కూడలి వద్ద జమ్మికుంట రూరల్ సీఐ కోరె కిశోర్ మాట్లాడుతూ, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ ఓటు వేయాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరుగడానికి సహకరించాలని కోరారు. అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, అసాంఘిక కార్యక్రమాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ తోట తిరుపతి, స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా తరలిస్తున్న బియ్యం పట్టివేత

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 10: పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం అర్ధరాత్రి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా బియ్యంలోడ్‌తో వెళ్తున్న లారీని చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. లారీలో సుమారు 320 క్వింటాళ్ల బియ్యం ఉండగా, అవి హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని భూపాలపల్లి రోడ్డులో గల శ్రీ రాజరాజేశ్వర ప్యాడి అండ్ రైస్ మిల్లు నుంచి గుజరాత్‌కు చెందిన లారీలో గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తున్నారని పోలీసులు తెలిపారు. బియ్యానికి సంబంధించిన ఎలాంటి అనుమతి పత్రాలు చూపకపోవడంతో లోడు బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుధవారం సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇచ్చి వాటిని అప్పగించారు. డీఎస్‌వో ఎం గౌరీశంకర్, డీటీ సీఎస్ వసంతరావు, ఎఫ్ఐ ఈ వినోద్‌కుమార్ పట్టుబడిన లారీలోని బియ్యం శాంపిళ్లను సేకరించారు. టెస్టింగ్ కోసం వాటిని హైదరాబాద్ ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. శాంపిల్ నిర్ధారణ అయ్యాక రైస్ మిల్ ఓనర్, బియ్యం తరలిస్తున్న లారీపై కేసు నమోదు చేస్తామని సివిల్ సప్లయ్ జిల్లా అధికారులు తెలిపారు.

హోం ఓటింగ్‌కు సహకరించాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 10 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న హోం ఓటింగ్‌కు అన్ని పార్టీలు సహకరించాలని సహాయ రిటర్నింగ్ అధికారి కే మహేశ్వర్ కోరారు. ఓటర్ల జాబితాపై స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వారాంతపు సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 85 ఏళ్లు పైబడ్డ వారికి, 40శాతానికి పైగా అంగవైకల్యం గల వారికి ఈసీ ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించిందని, అర్హులు వినియోగించుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తూ, ఓటు హక్కు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు సిరాజ్, మడుపు మోహనాచారి, రమణారెడ్డి, మిల్కూరి వాసుదేవరెడ్డి, కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయా పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

ముగ్గురి అరెస్ట్

రాంనగర్, ఏప్రిల్ 10: పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించేందుకు యత్నించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ముగ్గురిని రూరల్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మంగళవారం తెల్లవారుజామున దుర్గేడ్‌లోని వెంకటేశ్వర రైస్‌మిల్‌లో రేషన్ బియ్యం నిల్వ చేస్తున్నారన్నా సమాచారంతో దాడులు జరిపి 810 బస్తాల పీడీఎస్ రైస్ బ్యాగులను సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు మిల్లు యజమాని సంతోష్‌రెడ్డి, రేషన్ డీలర్ అంజయ్య, వాహన యజమాని మధును బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విదించడంతో జైలుకు తరలించారు.

బెల్ట్ షాపులపై ఎక్సైజ్ దాడులు

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని ఊటూర్, వేగురుపల్లి గ్రామాల్లో గల బెల్ట్ షాపులపై ఎక్సైజ్ దాడులు నిర్వహించగా దాదాపు రూ. 10 వేల విలువైన మద్యం పట్టుబడిందని ఎక్సైజ్ ఎస్ఐ శ్రీకాంత్ బుధవారం తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని, ఆయా బెల్ట్ షాపుల నిర్వాహకులు మూల కుమార్, పంజర్ల రామస్వామిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. బెల్ట్ షాపుల్లో మద్యాన్ని విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 10: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మైనారిటీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం అదనపు కలెక్టర్ ప్రపుల్‌దేశాయ్‌కి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో విద్యార్థి సంఘం నాయకులు సయ్యద్ ముబిన్, రాబిన్‌సింగ్, ఇంతియాజ్, అజీం, ఇలియాస్ ఉన్నారు.

హోమియోపతి పితామహుడి జయంతి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 10: ఫౌండర్ ఆఫ్ హోమియోపతి డాక్టర్ క్రిష్టియన్ ఫెడ్రిక్ సామ్యూల్ హనిమారి 269వ జయంతి వేడుకలను నగరంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ అండ్ హోమియోపతి అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ హరికృష్ణ హాస్పిటల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమియోపతి వైద్యాన్ని ప్రజలకు చేరువచేయడం కోసం సామ్యూల్ చేసిన కృషిని కొనియాడారు. హోమియోపతి డాక్టర్లు దీపక్‌బాబు, డేవిడ్, దయాకర్, మురళీకృష్ణ, వినయ్‌కుమార్, సౌమ్య, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 10: ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరిస్తూ, పనిభారం లెక్కల ప్రకారం కొత్త నియామకాలు చేపట్టాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు మధుసూదన్ కోరారు. నగరంలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రతినిధులు విష్ణు, రాజు, యాంసాని కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'గ్యారెంటీలు అమలు చేతగాక విమర్శలా?'

గంగాధర, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడం చేతగాకనే మంత్రి పొన్నం ప్రభాకర్ ఎంపీ బండి సంజయ్‌పై అనవసర విమర్శలు చేస్తున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూలం కల్యాణ్ విమర్శించారు. బుధవారం మండలంలోని మధురానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం